సాక్షి
సంగారెడ్డి

మంగళవారం। 1। అక్టోబర్। 2024



దసరాలోపు నామినేటెడ్
ఉమ్మడి మెదక్ జిల్లాలో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పదవులను దసరాలోపు భర్తీ చేయనున్నారు.
వివరాలు 8లో ▸



అన్ని రంగాల్లో రాణించేలా..
విద్యార్థులను చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు.
వివరాలు 8లో ▸



మది నిండుగా.. పూల పండుగ
ఆడపడచులు ఎంతో ఆడంబరంగా నిర్వహించుకునే బతుకమ్మ పండుగ బుధవారం నుంచి ప్రారంభం కానుంది.
వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

ఓపెన్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: రెగ్యులర్ పరీక్షల మాదిరిగానే ఈ నెల 3 నుంచి జరిగే ఓపెన్ పరీక్షలను కూడా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఓపెన్ పరీక్షలకు సంబంధించి జిల్లా అధికారులతో కలిసి ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. పదవ తరగతి, ఇంటర్‌కు సంబంధించి ఒక్కో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతలుగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డీఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టెన్త్‌లో 289 మంది, ఇంటర్‌లో 704 మంది హాజరు కానున్నట్లు తెలిపారు.

ట్రైడెంట్‌లో మరమ్మతు పనులు ప్రారంభం



కర్మాగారం మరమ్మతు పనుల కోసం నిర్వహిస్తున్న పూజలు

జహీరాబాద్: మండలంలోని కొత్తూర్(బి)లో గల ట్రైడెంట్ చక్కెర కర్మాగారంలో మరమ్మతు పనులకు పూజలు నిర్వహించారు. సోమవారం కర్మాగారం ప్రాంగణంలో సర్వమత ప్రార్థనలు జరిపి మరమ్మతు పనులు ప్రారంభించారు. మరమ్మతు పనులు పూర్తయ్యాక డిసెంబర్‌లో 2024–25 క్రషింగ్ సీజన్‌ను ప్రారంభిస్తామని బాధ్యులు పేర్కొన్నారు. ఎన్‌సీఎల్‌టీ ప్రత్యేకంగా ఆర్‌పీని నియమించి, ఆయన పర్యవేక్షణలో మరమ్మతులు, క్రషింగ్ నిర్వహణ చేపడతారని తెలుస్తోంది.

శాస్త్ర సాంకేతికపై అవగాహన



నాటికను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: మారుతున్న సమాజానికి అనుగుణంగా శాస్త్ర సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.సోమవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని సైన్స్ కేంద్రంలో జిల్లా స్థాయి డ్రామా ఫెస్టివల్ పోటీలు జరిగాయి. ఉన్నత పాఠశాలలోని 8 నుంచి 10వ తరగతి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా 'మానవ జాతి ప్రయోజనం కోసం శాస్త్ర సాంకేతికత అనే ప్రధాన అంశం'పై పోటీలు జరిగాయి. ఈ అంశానికి ప్రపంచ నీటి సంక్షోభం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ సొసైటీ, విపత్తులను అరికట్టడం కోసం ఆధునిక సాంకేతికత, ఆరోగ్యం–పరిశుభ్రత, వాతావరణ మార్పు దాని ప్రభావం అనే ఐదు ఉప అంశాలపై పోటీలు జరిగినట్లు జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వారు అక్టోబర్‌లో 17 ,18వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

రైతులకు ఇబ్బందులు కలగొద్దు



మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్

సంగారెడ్డి జోన్: జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ సూచించారు. సోమవారం సంగారెడ్డి డీసీఎంఎస్ కార్యాలయంలో కొనుగోలు కేంద్రాలపై సిబ్బందితో కలిసి ఆయన సమీక్షించారు. వరి కొనుగోలు చేసే సమయంలో నియమ నిబంధనలు పాటించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తేమ శాతం పరిశీలించి, సరైన విధంగా తూకం వేసి కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో డీసీఎంఎస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సామాన్యులే సమిధలు!

- సర్వేనంబర్లు, పొజిషన్ సర్టిఫికెట్లున్నా కూల్చివేతలా..?
- అనుమతులిచ్చిన అధికారుల సంగతేమిటి..?
- రెవెన్యూ, హైడ్రా దూకుడుపై బాధితుల ఆగ్రహం
- అధికారుల తీరుపై హైకోర్టు అసహనం



ఓ ఇంటిని నేలమట్టం చేస్తున్న దృశ్యం

"పైసాపైసా కూడబెట్టి ఇల్లు కట్టుకున్నాం.. అన్ని అనుమతులున్నాయి. సర్వేనంబర్‌లతో కూడిన పొజిషన్ సర్టిఫికెట్లు ఉన్నాయి. బ్యాంకు కూడా రుణం ఇచ్చింది. ఇంతకంటే ఇంకేమి ఆధారాలు కావాలి. ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటుంటే.. అధికారులొచ్చి అక్రమ నిర్మాణాలంటూ కూల్చడం ఎంత వరకు సమంజసం. అనుమతులు ఇచ్చిన అధికారులు, విక్రయించిన రియల్టర్లు బాగున్నారు. మధ్యలో డబ్బులు కట్టి ఇల్లు కొనుక్కున్న పేదలే సమిధలవుతున్నాం'' అని ఇటీవల ఇల్లు కూల్చివేతలకు గురైన బాధితులు వాపోతున్నారు.

పటాన్‌చెరు: హైడ్రా పేరుతో పటాన్‌చెరు మండలం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో కూల్చివేతలపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. అన్నీ అనుమతులున్నా, కనీసం నోటీసులివ్వకుండా కూల్చడం ఏమిటని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే అంశంపై స్థానిక తహసీల్దార్ రాధా వ్యవహార శైలిపై సోమవారం హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. న్యాయమూర్తి ప్రశ్నలకు తహసీల్దార్ ఉక్కిరిబిక్కిరి అయ్యారని మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. ప్రస్తుతం స్థానికంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డికి చెందిన నిర్మాణాలను తహసీల్దార్ రాధా ఆధ్వర్యంలో కూల్చివేశారు. తాను ఆ భూమిని కొనుగోలు చేసి నిర్మాణాలు చేపట్టినట్లు సదరు బాధితుడు వివరణ ఇచ్చాడు. ఆ సమయంలో రెవెన్యూ అధికారులు పెడచెవిన పెట్టారు. కిష్టారెడ్డిపేట పటేల్‌గూడలో కూడా బాధితులు తమ గోడు తెలిపేందుకు విఫలయత్నం చేశారు. ఈ విషయం తహసీల్దార్ రాధాకు చెప్పేందుకు యత్నిస్తే పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే భూమి సర్వే నంబరు, వారు ఉంటున్న పొజిషన్ తేడాలను కొనుగోలుదారులు గుర్తించలేరని బహిరంగ రహస్యమే. ఇదే విషయమై అమీన్‌పూర్ చైర్మన్ పాండురంగ రెడ్డి.. తహసీల్దార్ రాధాతో మాట్లాడారు. తాను కొనుగోలు చేసిన భూమికి పొజిషన్ చూపాలని గతంలోనే సర్వే కోసం దరఖాస్తు పెట్టుకున్నానని చెప్పారు. ఆయన ఆవేదనను అర్థం చేసుకున్నది లేదు. ఒక ప్రజాప్రతినిధి అభ్యర్థనను బేఖాతరు చేశారు. ఇక సాధారణ ప్రజల సంగతి సరేసరి. ఇదిలా ఉంటే తహసీల్దార్ వాదన మరోలా ఉంది. ఇప్పుడు ఉంటున్నది ప్రభుత్వ భూమి అని, దానికి నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదని వాదిస్తున్నారు. చివరికి ఆ ప్రాంతాల్లో కూల్చివేతలు చేపట్టారు. లబోదిబోమంటున్నా తమ పనిచేసుకుంటూ పోయారు.

ఆఖరి అవకాశం ఇచ్చారా..?

తాజాగా ఈ విషయమై హైకోర్టులో అమీన్‌పూర్ తహసీల్దార్ రాధ వివరణపై న్యాయమూర్తి లక్ష్మణ్ సంతృప్తి చెందకపోగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. సెలవుల్లో ఎందుకు నోటీసులు ఇచ్చి, అత్యవసరంగా కూల్చివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాళీ చేయనంత మాత్రాన అత్యవసరంగా కూల్చాల్సిన అవసరం ఏముందన్నారు. కోర్టు తీర్పుల విషయం కూడా తెలియదా అని తహసీల్దార్‌ను నిలదీశారు. పైఅధికారులను మెప్పించేందుకు చట్టవిరుద్ధంగా పనిచేయొద్దని హితవు పలికారు. ఇల్లు కూల్చే ముందు యజమానికి చివరి అవకాశం ఏమైనా ఇచ్చారా అని అడిగారు. కోర్టు వేసిన ప్రశ్నలకు తహసీల్దార్ సమాధానాలు ఇవ్వలేక తెల్లముఖం వేశారు.

సాధారణ పౌరులకు ఇబ్బందులు వద్దు



అధికారులు ఏ చర్యలు తీసుకున్నా సాధారణ పౌరులను ఇబ్బందులు పెట్టొద్దు. తాజాగా జరుగుతున్న అక్రమాలు, ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు దృష్టి పెడితే బాగుంటుంది. రెండు దశాబ్దాల క్రితం వెలిసిన వెంచర్లలో నిర్మిస్తున్న భవనాలను కూల్చి వేయడం సరైన నిర్ణయం కాదు. ముందుగానే నోటీసులు ఇచ్చి ఆ ఇంటిని ఎందుకు కూలుస్తున్నారో చెప్పి.. ఆ తర్వాత చర్యలకు ఉపక్రమించి ఉంటే ఎవరికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. అమీన్‌పూర్, కృష్ణారెడ్డిపేట, పటేల్‌గూడలలో రెవెన్యూ అధికారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరించి కూల్చివేత కార్యక్రమం చేపట్టారు. అందుకే కోర్టు కూడా మొట్టికాయలు వేసింది.

–భాషెట్టి కృష్ణ, కౌన్సిలర్, అమీన్‌పూర్

సాహితీకి సహకరించిందెవరు?

- రంగంలోకి ఈడీ.. అక్రమార్కుల గుండెల్లో రైళ్లు
- జిల్లాలోనూ సంస్థ బాధితులు
- అమీన్‌పూర్‌లో రెండు కేసులు .. హైదరాబాద్ సీసీఎస్ దర్యాప్తు



అమీన్‌పూర్‌లో సాహితీ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు (ఫైల్)

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : హైరేంజ్ అపార్ట్‌మెంట్లు.. 30 అంతస్తులు.. పది టవర్లు.. ప్రీలాంచ్ ఆఫర్ పేరుతో వినియోగదారులను నిండా ముంచిన సాహితీ ఇన్‌ఫ్రాస్టక్చర్ లక్ష్మీనారాయణ వ్యవహారాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన అధికారుల తీరుపై ఇప్పుడు సర్వత్రా చర్చ జరుగుతోంది. పట్టా భూముల పేరుతో.. ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు షురూ చేసినా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. ఈ విషయమై జిల్లాలోని కీలక రెవెన్యూ అధికారులకు భారీ మొత్తంలో ముడుపులు అందాయనే ఆరోపణలు అప్పట్లో వ్యక్తమయ్యాయి. తాజాగా లక్ష్మీనారాయణ కేసుపై ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) దృష్టి సారించింది. ఆది, సోమవారాల్లో ఆ సంస్థ కార్యాలయాల్లో, ఇళ్లల్లో సోదాలు నిర్వహించడంతో పాటు ఆయన్ను ఈడీ అధికారులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో సాహితీకి సహకరించిన రెవెన్యూ ఉన్నతాధికారుల ముడుపుల అంశం తెరపైకి వస్తోంది. దీంతో అక్రమార్కుల గుండెల్లో ఇప్పుడు రైళ్లు పరుగెడుతున్నాయి.

సర్కారు భూమిలో నిర్మాణాలు..

రాజకీయ అండదండలతో లక్ష్మీనారాయణ జిల్లాలోని అమీన్‌పూర్‌లో ఓ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు చేపట్టారు. హైరేంజ్ అపార్ట్‌మెంట్లు.. అంతర్జాతీయ ప్రమాణాలతో అపార్ట్‌మెంట్లు నిర్మిస్తామని చెప్పి ఏజెంట్లను నియమించుకుని భారీ దందాకు తెర లేపారు. 30 అంతస్తులతో కూడిన పది టవర్లు నిర్మిస్తామని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ముందుగా ఫ్లాట్ బుక్ చేసుకుని డబ్బులు చెల్లిస్తేభారీగా డిస్కౌంట్లు ప్రకటించారు. ఒక్కో అపార్ట్‌మెంట్‌కు రూ.లక్షల్లో చెల్లిస్తే ఇప్పటి వరకు వినియోగదారులకు అప్పగించలేదు. ఇలా హెచ్‌ఎండీఏ పరిధిలో సుమారు రూ.1,500 కోట్లకు పైగా వినియోగదారుల నుంచి వసూలు చేసినట్లు గతంలో పోలీసు ఉన్నతాధికారులే ప్రకటించారు. ఇలా జిల్లా ప్రాజెక్టుకు సంబంధించిన బాధితులు కూడా వందల్లో ఉన్నారు. వారి నుంచి ఫిర్యాదు రావడంతో అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదైంది. వాటిని హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఏడాదికిపైగా ఆందోళన చేసినా..

సాహితీ బాధితులు అమీన్‌పూర్‌లో ఏడాదికిపైగా ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని సుమారు 400 రోజులపాటు నిరాహార దీక్షలు చేశారు. పట్టా భూమి అని చెప్పి.. ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చూపించి నిండా ముంచిన సాహితీ లక్ష్మీనారాయణ నుంచి డబ్బులు తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రజాఫిర్యాదుల విభాగంలో పలుమార్లు ఫిర్యాదు చేశారు. అయినా జిల్లా కీలక ఉన్నతాధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. దీంతో బాధితుల పరిస్థితి అరణ్యరోదనగా మారింది. అధికారులు పెద్ద ఎత్తున ముడుపులు తీసుకుని ఆయనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడు ఈడీ రంగంలోకి దిగడం, మనీ ల్యాండరింగ్ వ్యవహారాలపై ఆరా తీయడంతో సంస్థ నుంచి ముడుపులు పొందిన అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

1,621 కేసుల్లో రాజీ

- లోక్ అదాలత్ ఒక సదావకాశం
- ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డి జోన్: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన సైబర్ క్రైమ్ నమోదైన కేసులు పరిష్కరించి, రీఫండ్ అందించడంలో రాష్ట్రస్థాయిలో జిల్లా మూడో స్థానంలో నిలిచిందని ఎస్పీ చెన్నూరు రూపేశ్ సోమవారం వెల్లడించారు. జాతీయ మెగా లోక్‌అదాలత్ పురస్కరించుకొని జిల్లాలో చాలాకాలంగా పెండింగ్ ఉన్న 1,621 కేసులలో ఇరువర్గాలు రాజీ పడ్డారన్నారు. క్షణికావేశంలో చేసిన తప్పులకు లోక్ అదాలత్ లో రాజీ పడటం మంచి అవకాశం అన్నారు. సైబర్ బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ ఆధ్వర్యంలో డీసీసీసీని ఏర్పాటు చేసి డీఎస్పీ స్థాయి అధికారులతో పర్యవేక్షిస్తామన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లో నమోదైన 140 సైబర్ క్రైమ్ కేసులలో రూ. ఒక కోటి 91 లక్షల తిరిగి సైబర్ బాధితులకు అందించేందుకు ఆర్డర్ కాపీలు సంబంధిత నోడల్ ఆఫీసర్లకు అందించామన్నారు.

జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు



సంగారెడ్డి జిల్లాలో 30 రోజులపాటు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు. శాంతి భద్రతల నేపథ్యంలో జిల్లాలో అక్టోబర్ 1 నుంచి 31 వరకు ఈ యాక్ట్ అమలు ఉంటుందని పేర్కొన్నారు. పోలీసుల ముందస్తు అనుమతి లేనిదే సంగారెడ్డి జిల్లాలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు అనుమతులు లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు, నిరసన, పబ్లిక్ మీటింగ్‌లు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. ఒకవేళ నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు భంగం కల్గించేలా, ప్రజాధనానికి నష్టం కలిగించేలా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను చేపట్టకూ డదని హెచ్చరించారు.

కొత్త సార్లొస్తున్నారు



జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు 551

- 1:3 నిష్పత్తిలో భర్తీకి అవకాశం
- డీఎస్సీ ఫలితాలు విడుదల

సంగారెడ్డి ఎడ్యుకేషన్: డీఎస్సీ ఫలితాలు వెలువడటంతో పరీక్ష రాసిన అభ్యర్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. గత ప్రభుత్వం 10 సంవత్సరాలలో ఒకేసారి 5 వేల ఉపాధ్యాయ పోస్టులకు డీఎస్సీకి నోటిఫకేషన్ ఇచ్చినప్పటికీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పరీక్ష నిర్వహణ సాధ్యం కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల సమయంలోనే గతంలో ఉన్న పోస్టులకు అదనంగా మరో 6 వేలు కలిపి మొత్తం 11 వేల ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి డీఎస్సీ పరీక్ష నిర్వహించి 2 నెలల్లోనే ఫలితాలు ప్రకటించడం అభ్యర్థుల్లో ఆనందం నింపింది.

జిల్లాలో 551 ఖాళీలు

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 551 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో లాంగ్వేజ్ పండిట్ పోస్టులు 24, పీఈటీ 6, స్కూల్ అసిస్టెంట్ 92, ఎస్జీజీ 385, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్‌లు 9, ఎస్‌జీటీ స్పెషల్ టీచర్ పోస్టులు 35 ఉన్నాయి. సోమవారం వెలువడిన ఫలితాల్లో భాగంగా జిల్లాలో గల 551 ఖాళీలు 1:3 నిష్పత్తిలో భర్తీ చేసే అవకాశం ఉంది.

నేటి నుంచే సర్టిఫికెట్ల పరిశీలన

డీఎస్సీ ఫలితాల్లో మెరిట్ సాధించిన అభ్యర్థులకు మంగళవారం నుంచి సంగారెడ్డిలో ఉన్న శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు డీఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. డీఎస్సీ–2024లో మెరిట్ సాధించిన అభ్యర్థుల 1:3 వివరాలు సబ్జెక్టుల వారీగా school.edu. telangana. gov.in, www. deosangareddy.in అనే వెబ్‌సైట్‌లలో పొందుపరిచినట్లు తెలిపారు. పరిశీలనకు వచ్చే అభ్యర్థులు www.schooledu. telangana.gov.in నుంచి ప్రొఫార్మా డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు పొందుపరచాలని పేర్కొన్నారు. కేటాయించిన కౌంటర్లలో ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫై చేయించాలని తెలిపారు. ప్రొఫార్మాతో పాటు గెజిటెడ్ అధికారితో అటెస్ట్ చేయించిన అన్ని సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను (రెండు జతలు), లేటెస్ట్ రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో కేటాయించిన కౌంటర్‌లో సమర్పించాలని సూచించారు.

సోషల్ విభాగంలో.. యోగేశ్



నారాయణఖేడ్: కోచింగ్ లేకుండా ప్రిపేర్ అయి డీఎస్సీ ఫలితాల్లో.. సోషల్ విభాగంలో బోక్కసగాంకు చెందిన యోగేశ్ ప్రథమస్థానం సాధించాడు. ఇప్పటికే ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలలో కాంట్రాక్టు పద్ధతిన అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. డీఎస్సీ పరీక్షలో మొదటి ప్రయత్నంలోనే సోషల్ విభాగంలో ఫస్ట్ ర్యాంకు సాధించారు. ఇప్పుడు స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 80.93 మార్కులు సాధించడం, జిల్లాస్థాయిలో ప్రథమస్థానం పొందాడు యోగేశ్.

ఫిజికల్ సైన్స్‌లో.. మశ్చేందర్



కల్హేర్(నారాయణఖేడ్): డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని రాపర్తికి చెందిన ఎం.మశ్చేందర్ ప్రతిభకనబర్చారు. ఇటీవల పీజీటీ ఫలితాల్లో ఫిజికల్ సైన్స్ టీచర్‌గా ఎంపికయ్యారు. నల్లవాగు గురుకుల పాఠశాలలో ఉద్యోగం చేస్తున్నారు. ఇప్పుడు డీఎస్సీ ఫలితాల్లో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించారు. ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా అర్హత సాధించాడు. మార్డికు చెందిన జుమ్మ లక్ష్మణ్ 78.70 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో మూడో ర్యాంక్ సాధించారు.

తెలుగు విభాగంలో.. కాశీనాథ్



నారాయణఖేడ్: మండలంలోని జగన్నాథ్‌పూర్‌కు చెందిన ఎం.కాశీనాథ్ తెలుగు విభాగంలో స్కూల్ అసిస్టెంట్‌గా జిల్లాలో మొదటి ర్యాంకు సాధించారు. ఐదేళ్లుగా డీఎస్సీ పరీక్షల కోసం ప్రిపేర్ అవుతూ పరీక్షకు హాజరయ్యాడు. సోషల్ విభాగంలో పీజీ చేసినప్పటికీ సెకండ్ ఆప్షన్‌లో తెలుగు ఎంచుకొని జిల్లా స్థాయిలో 75.13 మార్కులు సాధించి ప్రథమ ర్యాంకు దక్కించుకున్నారు. జిల్లా ప్రథమ ర్యాంకు సాధించడంపై ఆనందంగా ఉందని కాశీనాథ్ పేర్కొన్నారు.

గురుకులంలో కలెక్టర్ బస

- మౌలిక సదుపాయాల పరిశీలన
- విద్యార్థినుల సమస్యలపై ఆరా



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం చిట్కూల్ గ్రామ పరిధిలోని సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ గురుకుల బాలికల పాఠశాలలో కలెక్టర్ క్రాంతి సోమవారం రాత్రి బస చేశారు. రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం విద్యార్థినుల స్టడీ అవర్స్ కొనసాగుతుండడాన్ని గమనించి, వారికి అందిస్తున్న భోజన, వసతి సదుపాయాలు, విద్యాబోధన, రోజువారీ దినచర్య, మెనూ వంటి అంశాలను పాఠశాల ప్రిన్సిపాల్ కల్పనను అడిగి తెలుసుకొన్నారు. ఇక్కడ కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. పదవ తరగతి, ఇంటర్ విద్యార్థినులను పలు ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని పరీక్షించారు. తర్వాత అన్ని తరగతి గదులను, డార్మెటరీలు, కిచెన్, డైనింగ్ హాల్‌లను సందర్శించారు. స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి, వారికి ఉన్న సమస్యలు, అభ్యర్థనలు ఏమైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. రాత్రంతా పాఠశాలలోనే ఉండి, విద్యార్థులతో కలిసి గడిపారు. ప్రభుత్వ విద్యావిధానాలు ఎంతవరకు అమలవుతున్నాయో తెలుసుకోవడానికే ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మైనార్టీ వెల్ఫేర్ అధికారి దేవుజా, తహసీల్దార్ రంగారావు, ఎంఈఓ రాజేశ్వర్‌రావు, మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్, చిట్కుల్ గ్రామ కార్యదర్శి కవిత, వసతి గృహసిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీలకు ఊరట

- రూ.99 కోట్ల నిధులు విడుదల
- ట్రాక్టర్ ఈఎంఐ, కార్మికుల వేతనాలు, అభివృద్ధికి కేటాయింపు

సంగారెడ్డి జోన్: జిల్లాలోని గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. కొన్ని నెలలుగా వాటికి నిధులు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామాలలో సర్పంచ్‌ల పదవీకాలం ముగియటంతో ప్రత్యేక పాలన కొనసాగుతోంది. సరైన విధంగా నిధులు లేకపోవడంతో సంబంధిత పంచాయతీ కార్యదర్శులపై ఆర్థిక భారం పడింది. ఎట్టకేలకు జిల్లావ్యాప్తంగా రూ.9 కోట్లు విడుదలయ్యాయి.

జిల్లావ్యాప్తంగా 646 గ్రామ పంచాయతీలున్నాయి. ఇటీవల 11 పంచాయతీలు మున్సిపాలిటీలో విలీనం కాగా కొత్తగా మరో 11జీపీ (గ్రామ పంచాయతీ)లు ఏర్పాటయ్యాయి. ఆయా పంచాయతీల జనాభా ఆధారంగా రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. ప్రభుత్వం పంచాయతీలకు మూడు రకాల నిధులు విడుదల చేయడంతో వీటికి కొంతమేర ఊరట లభించింది. 2 నెలల క్రితం మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలు చెల్లించేందుకు నిధులు విడుదలయ్యాయి. పాత పంచాయతీలలో నిధుల లేమితో ట్రాక్టర్ల ఈఎంఐలు, మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు పెండింగ్ లో ఉన్నాయి. విజయదశమి పండుగ నేపథ్యంలో నిధులు విడుదల కావడంతో మల్టీపర్పస్ వర్కర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీలలో ప్రత్యేక పాలన అనంతరం నిధులు విడుదల కాలేదని సంబంధిత శాఖ అధికారుల సమాచారం. పంచాయతీల నిర్వహణ కార్యదర్శులకు ఇబ్బందికరంగా మారింది. ప్రస్తుతం నిధులు మంజూరు కావడంతో కార్యదర్శులకు పంచాయతీ నిర్వహణ సులభతరం కానుంది.

మూడు రకాల నిధులు

జిల్లాలోని గ్రామపంచాయతీలకు రాష్ట్ర ఆర్థిక సంఘం మూడు రకాల నిధులు మంజూరు చేసింది. ట్రాక్టర్ ఈఎంఐ, సీసీ చార్జీలు, స్వచ్ఛదనం పచ్చదనం కోసం రూ.9,01, 59, 573 లు మంజూరైనట్లు అధికారులు వెల్లడించారు. ట్రాక్టర్ ఈఎంఐలకు రూ.4 లక్షల 89 వేలు, సీసీ చార్జీలు(విద్యుత్ బిల్లులు) రూ. 2 కోట్ల 5 లక్షల 56 వేలు, మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు రూ. 3 కోట్ల 6 లక్షల 83 వేలు, స్వచ్ఛతనం పచ్చదనం, స్వచ్ఛతను పచ్చదనంలో భాగంగా జనాభా ఆధారంగా నిధులు వెచ్చిస్తున్నట్లు తెలిపారు.



హత్నూర మండలంలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులు(ఫైల్)

నిబంధనల ప్రకారం ఖర్చు చేస్తాం



రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి విడుదలైన నిధులు నేరుగా పంచాయతీ ఖాతాలో జమవుతాయి. నిబంధనల మేరకు నిధులు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. పంచాయతీల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– సాయిబాబా, జిల్లా పంచాయతీ అధికారి, సంగారెడ్డి

క్లుప్తంగా

రాములుశర్మకు డాక్టరేట్


పట్టాలతో రాములుశర్మ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, గ్రామ పురోహితుడు దేశిపతి మెట్టు రాములుశర్మకు గౌరవ డాక్టరేట్ వచ్చినట్లు సోమవారం ఆయన తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రిసెర్చ్ స్ఫూర్తి అవార్డు ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు.

కుదిరిన పరస్పర సహకార ఒప్పందం


ఒప్పంద పత్రాలను చూపుతున్న అధికారులు

ములుగు(గజ్వేల్): ములుగు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం(ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ) హైదరాబాద్‌కు చెందిన అనురాగ్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్‌ల మధ్య సోమవారం పరస్పర సహకార ఒప్పందం కుదుర్చుకున్నారు. ములుగు వైస్ చాన్స్‌లర్ డాక్టర్.బి నీరజప్రభాకర్, అనురాగ్ సంస్థకు చెందిన అధికారులు డాక్టర్. అర్చన మంత్రి, డాక్టర్.నారాయణ, డాక్టర్.డీ ప్రతిభ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఉద్యాన పంటల్లో కృత్రిమ మేధ ఆధారిత, సెన్సార్ ఆధారిత సాంకేతిక ఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్ ప్రోగ్రామ్‌లపై ఇరువురి మధ్య సహకార పరిశోధన కార్యక్రమాలను నిర్వహించడం, సామర్థ్యాన్ని పెంపొందించే కార్యక్రమాల్లో సహకారాలు కలిగి ఉండటం ఈ ఒప్పందం యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. విశ్వవిద్యాలయ అధికారులు భగవాన్, లక్ష్మీనారాయణ, రాజశేఖర్, విజయ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించండి

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- ప్రభుత్వ పాఠశాల భవనం ప్రారంభం


పాఠశాల భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో మన ఊరు–మన బడి కార్యక్రమంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని మెదక్ ఎంపీ రఘునందన్ రావుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాల భవనాలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిర్మించడం జరిగిందన్నారు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధితోపాటు విద్యార్థుల కోసం ఆధునిక మౌళిక సదుపాయాలను కల్పించడం జరిగిందన్నారు. అనంతరం మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు స్వయ రక్షణపై శిక్షణ అందించాలని సూచించారు. అదే విధంగా రామచంద్రాపురం డివిజన్‌లోని పలు సమస్యలను తన దృషికి తీసుకురావడం జరిగిందన్నారు. పట్టణంలో త్వరలో పోస్ట్ కార్యాలయం ప్రారంభం కానుందని తెలిపారు. అదే విధంగా ఎంఎంటీఎస్ రైలు సర్వీస్‌లు పెంచే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు పుష్ప నగేశ్, మెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి, ఎంఈఓ పీపీ రాథోడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కమ్యూనిటీ కాంటాక్ట్'తో పరిష్కారం

ఏసీపీ మధు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌ద్వారా సమస్యలను గుర్తించి, పరిష్కరించే అవకాశం ఉంటుందని సిద్దిపేట ఏసీపీ మధు అన్నారు. జిల్లా కేంద్రంలోని కేసీఆర్‌నగర్ డబల్‌బెడ్రూం కాలనీలో సోమవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా అనుమానస్పద ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 బైక్‌లు, ఒక కారు, 3ఆటోలను సీజ్‌చేశామని చెప్పారు. పట్టణాలలో ఎవరైనా కొత్త వ్యక్తులు, నేరస్తులు వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం ఈ ప్రోగ్రాం ద్వారా తెలుస్తుందని చెప్పారు. రాజకీయ నాయకులు, వ్యాపారస్తులు, ఉద్యోగులు సీసీ కెమేరాల ఏర్పాటుకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మది నిండుగా.. పూల పండుగ



రేపటి నుంచి బతుకమ్మ సంబురాలు

- పూల పండుగకు సిద్ధమైన మహిళలు
- ఎంగిలి పువ్వుతో ప్రారంభమై సద్దులతో ముగింపు

జగదేవ్‌పూర్: దేవుళ్లను పూలతో పూజిస్తే.. ఆ పూలను పూజించే సంస్కృతీ తెలంగాణ ప్రత్యేకం. కేవలం మన రాష్ట్రానికే సొంతమైన ఇలాంటి వేడుక రానే వచ్చింది. తెలంగాణ ఆడపడచులు ఎంతో ఆడంబరంగా నిర్వహించుకునే బతుకమ్మ పండుగ బుధవారం నుంచి వైభవంగా ప్రారంభం కానుంది. మన సాంస్కృతిక అస్తిత్వ పతాక.. బతుకమ్మ, పూల పండగ పరిమళాలతో ఊరూవాడా హోరెత్తనుంది. 2వ తేదీ ఎంగిలి బతుకమ్మతో ప్రారంభమయ్యే సంబురాలు 9 రోజులపాటు ఘనంగా జరిగి సద్దులతో ముగియనున్నాయి.

బతుకమ్మకు నైవేద్యాలు..

బతుకమ్మ పండుగకు తొమ్మిది రోజులు తొమ్మిది రకాల నైవేద్యాలను సమర్పిస్తారు. రోజుకొక్క తీరుతో గౌరమ్మను కొలుస్తారు.

ఎంగిలి పువ్వు బతుకమ్మ..

మొదటి రోజు మహాలయ అమావాస్య రోజు బతుకమ్మ వేడుక ప్రారంభమవుతుంది. దీన్ని పెత్తరామాస అని అంటారు. నువ్వులు, బియ్యం పిండి, నూకలు కలిపి నైవేద్యం తయారు చేస్తారు.

అటుకుల..

రెండోరోజు అశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు అటుకుల బతుకమ్మగా కొలుస్తారు. సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో నైవేద్యం తయారు చేసి అమ్మ వారికి సమర్పిస్తారు.

ముద్దపప్పు..

మూడో రోజు ముద్ద పప్పు బతుకమ్మ అని అంటారు. ముద్దపప్పు, బెల్లం, పాలుతో కలిపి నైవేద్యం తయారు చేసి సమర్పిస్తారు.

నానే బియ్యం...

నాలుగో రోజు నానే బియ్యం బతుకమ్మ అని అంటారు. నానేసిన బియ్యం పాలు, బెల్లం కలిపి నైవేద్యం చేస్తారు.

అట్ల..

ఐదో రోజు అట్ల బతుకమ్మ అంటారు. అట్లు లేదా దోశ నైవేద్యంగా సమర్పిస్తారు.

అలిగిన...

ఆరో రోజు అలిగిన బతుకమ్మ అంటారు. ఈ రోజు అశ్వయుజ పంచమి, నైవేద్యమేమి సమర్పించరు. (అర్రెమి). ఆ రోజు బతుకమ్మలు పేర్చారు.

వేపకాయల..

ఏడో రోజు వేపకాయల బతుకమ్మ అంటారు. బియ్యం పిండిని బాగా వేయించి వేప పండ్లుగా తయారు చేసి నైవేద్యంగా పెడుతారు.

వెన్నముద్దల బతుకమ్మ..

ఎనిమిదో రోజు వెన్నముద్దల బతుకమ్మ అంటారు. ఈ రోజు నువ్వులు, వెన్న లేదా నెయ్యి బెల్లం కలిపి నైవేద్యంగా తయారు చేస్తారు.

సద్దుల బతుకమ్మ..

తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ అంటారు. అశ్వయుజ అష్టమి నాడు అదే రోజు దుర్గాష్టమిని జరుపుకుంటారు. ఐదు రకాల నైవేద్యాలు తయారు చేస్తారు. సాయంత్రం పాటలు పడుతూ ఆటలు ఆడుతారు. చెరువు వద్ద కూడా బతుకమ్మ ఆడి చెరువులోని నిమజ్జనం చేస్తారు. ఆ తర్వాత చక్కెర, రొట్టెతో చేసిన మలీద అనే వంటకాన్ని బంధువులకు పంచి తింటారు. ఆ తర్వాత ఖాళీ పళ్లెం (తాంబళం)తో పాటలు పడుతూ ఇంటికి చేరుతారు.

మైనర్ హత్య కేసులో దంపతులకు యావజ్జీవం

సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్

కొండాపూర్(సంగారెడ్డి): మైనర్ హత్య కేసులో దంపతులకు ఫ్యామిలీ కోర్టు, 4వ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి లావణ్య బాల్‌రెడ్డి జీవిత ఖైదు విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించినట్లు సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు. వివరాల ప్రకారం.. జాకీర్ అహ్మద్, అతని భార్య రజియా సుల్తానాలు మల్కాపూర్ చౌరస్తాలోని గాంధీనగర్‌లో నివాసం ఉండేవారు. ఐడీఏ బొల్లారంలో హెడ్ కానిస్టేబుల్‌గా జాకీర్ విధులు నిర్వహిస్తుంటే ఆమె భార్య ఇంటి వద్దే ఉండేది. 5 సంవత్సరాల క్రితం 2015 జనవరిలో కర్ణాటక.. గుల్బర్గా నుంచి ఓ బాలికను తీసుకొచ్చి ఇంట్లో పనికి పెట్టుకున్నారు. పనులు సరిగ్గా చేయడం లేదని, శారీరకంగా మానసికంగా హింసిస్తూ వాతలు పెట్టడంతో గాయాలయ్యాయి. రోజూ హింసించడంతోపాటు ఆమెను కొట్టడం ద్వారా అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతిచెందింది. మైనర్‌ను పనిలో పెట్టుకోవడమే కాకుండా చిత్రహింసలకు గురిచేసి మరణానికి కారణమైన నిందితులపై అప్పటి ఎస్సై ప్రవీణ్ కుమార్ కేసు నమోదు చేశారు. సీఐ నాగరాజు విచారణ పూర్తి చేసి చార్జ్ షీట్ దాఖలు చేశాడు. ఆ మేరకు సోమవారం కేసు పూర్వాపరాలను పరిశీలించిన ఫ్యామిలీ కోర్ట్, 4వ సెషన్స్ సంగారెడ్డి జిల్లా న్యాయమూర్తి కోట్ల లావణ్య బాల్‌రెడ్డి నిందితులకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చిందని ఎస్పీ తెలిపారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన నాటి ఎస్సై, సీఐతో పాటు ప్రస్తుత కొండాపూర్ ఎస్సై హరిశంకర్‌గౌడ్, సీఐ రైటర్ లతీఫ్ హుస్సేన్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శాలకృష్ణ, కోర్ట్ డ్యూటీ హెడ్ కానిస్టేబుళ్లు బస్వరాజ్, వెంకటేశ్వర్లు, కోర్ట్ లైజనింగ్ అధికారి ఎస్సై కె. సత్యనారాయణ డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ బి.రమేశ్‌లను ఎస్పీ అభినందించి, రివార్డ్‌లు ప్రకటించారు.

పెద్దల పేరిట బ్రాహ్మణులకు దానం

దుబ్బాక : తెలంగాణ సంస్కృతిలో పెత్తర అమావాస్యకు చాలా ప్రత్యేకత ఉంది. గతించిన పెద్దల పేరిట బ్రాహ్మణులకు బియ్యం, పప్పు లు, కాయగూరలు, పాలు, పెరుగు, ధనం, ధాన్యంను దానం చేయడం తరతరాలుగా వస్తున్న ఆచారం. ఎక్కడెక్కడో సుదూర ప్రాంతాల్లో ఉన్న వారు సైతం పెత్తర అమావాస్యకు తమ తమ ఇళ్ల చేరుకొని తమ పెద్దల పేరిట బియ్యం ఇస్తుంటారు. బుధవారం ఉద యం నుంచి సాయంత్రం వరకు పెద్దలకు బి య్యం ఇవ్వాలని పురోహితులు చెబుతున్నారు.

పెత్తర అమావాస్య రోజే బతుకమ్మ

పెత్తర అమావాస్య నుంచే బతుకమ్మ పండుగ ప్రారంభమవుతుంది. ప్రతీయేటా పెత్తర అమావాస్య సందర్భంగా బతుకమ్మలను తప్పకుండా పేర్చడం తరాల నుంచి ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా బుధవారం బతుకమ్మ పండుగ ప్రారంభం అవుతుంది.10 వ తేదీ వరకు బతుకమ్మ పండుగ జరుపుకోవాలని బ్రాహ్మణులు సూచించారు.

యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో సిద్దిపేట జిల్లా క్రీడాకారులు రాణించి, బంగారు పతకాలు సాధించారని జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డి సోమవారం తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించి, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. సింధూరి, మనీషా, వురేశ్, ఉమాదేవి, శ్రీప్రసన్న జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు అంజయ్య , చీఫ్ పాట్రన్ చిప్ప ప్రభాకర్, ఉపాధ్యక్షుడు విక్రం రెడ్డి, హరిప్రసాద్ తదితరులు విజేతలను, శిక్షకులను అభినందించారు.

డిగ్రీ కళాశాల విద్యార్థికి బంగారు పతకం


మెదక్ జోన్ : కార్తీక్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది

మెదక్‌జోన్ : యోగాసన పోటీల్లో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి బంగారు పతకం సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ హుసేన్ తెలిపారు. 29న నిజామాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో ద్వితీయ సంవత్సరం విద్యార్థి కుమ్మరి కార్తీక్ పాల్గొని బంగారు పతకంతోపాటు ఆర్టిస్టిక్ విభాగంలో వెండి పతకం సాధించినట్లు పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో కార్తీక్‌ను ఘనంగా సత్కరించారు. అలాగే వచ్చే నెల కర్ణాటకలోని బెంగళూరు పట్టణంలో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజీ ఇన్‌చార్జి గణపతి ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు శరత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానంతో అధునాతన గన్స్

- డీఆర్డీఓ, ఆర్మీ సహకారంతో తయారీ
- లోకేష్ మిషనరీ పరిశ్రమ ఎండీ శ్రీకృష్ణ


మిషన్ గన్స్‌ను పరిశీలిస్తున్న శ్రీకృష్ణ

మనోహరాబాద్(తూప్రాన్): ఆర్మీ, డీఆర్డీఏ సహకారంతో ఆధునిక పరిజ్ఞానం ఉపయోగించి అధునాతన గన్స్ తయారు చేసి అందిస్తున్నామని లోకేష్ మిషనరీ పరిశ్రమం ఎండీ లోకేశ్వరరావు తెలిపారు. మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ గ్రామ శివారులో టీఎస్ఐసీసీ పరిశ్రమల వాడలో గల లోకేష్ మిషనరీ పరిశ్రమలో ఆర్మీ, బీఎస్ఎఫ్, సీఆర్ఎఫ్ తదితర సంస్థల కోసం గన్స్ తయారీ కేంద్రంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్మీ వారి ఆర్డర్ మేరకు 550 మిషన్ గన్స్‌లు తయారు చేసి సోమవారం వారికి అందజేసినట్లు పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మేజర్ జనరల్ రాకేష్ మనోచ ఆధ్వర్యంలో గన్స్‌ను లారీలోకి డంప్ చేసి వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు పరిశ్రమలో తయారు చేసిన వాటిని పరిశ్రమ వద్ద ప్రదర్శించారు.

అన్యమత ఉద్యోగులను తొలగించాలి

మెదక్ కలెక్టరేట్: దేవాదాయశాఖను రద్దు చేసి హిందూ ధార్మిక సంస్థల్లో అన్యమత ఉద్యోగస్తులను తొలగించాలని వీహెచ్‌పీ ఉమ్మడి జిల్లా సంఘటన కార్యదర్శి పుట్టి మల్లేశం అన్నారు. సోమవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేవాలయ ప్రాంగణాల్లో దుకాణాలను హిందువులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. అన్యాక్రాంతమైన దేవాలయాల భూములను స్వాధీనం చేసుకోవాలని అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నాయకులు సత్యనారాయణ, నందారెడ్డి, కృష్ణమూర్తి, మహిళా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థులు


సిద్ధార్థ


శ్రీవాణి

గజ్వేల్‌రూరల్: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా సోమవారం మండల పరిధిలోని కొడకండ్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ హుస్నాబాద్‌లో అండర్–17 విభాగంలో జరిగిన జిల్లాస్థాయి పోటీలలో తమ విద్యార్థులు సిద్ధార్థ, శ్రీవాణి ప్రతిభను చాటారన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం : ఆకుల రజిత

- రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రజిత

హుస్నాబాద్: క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమేనని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్ -17 బాల బాలికల హ్యాండ్ బాల్ ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు సోమవారం హుస్నాబాద్ మినీ స్టేడియంలో నిర్వహించారు.ఉమ్మడి జిల్లా నుంచి 150 మంది బాలురు, 100 మంది బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన 16 మంది బాలురు, 16 మంది బాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి సౌందర్య తెలిపారు. ఎంపికైన బాల బాలికలు అక్టోబర్ 3 నుంచి 5వ తేదీ వరకు నారాయణపేట్ జిల్లా కోస్గిలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారని ఆమె వెల్లడించారు. పోటీలను ప్రారంభించిన రజిత మాట్లాడుతూ.. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి శ్రీనివాస్, కౌన్సిలర్ కొంకట నళినిదేవి, పీడీలు పాల్గొన్నారు.

గురువన్నపేటలో రెండో రోజు ఉద్రిక్తత

నిందితుడు ఇంటిపై దాడి చేసిన వారిని అరెస్టు చేసిన పోలీసులు

- అడ్డుకున్న గ్రామస్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): బాలికపై యువకుడు అత్యాచారం జరిపిన ఘటనలో మండలంలోని గురువన్నపేట గ్రామంలో రెండవ రోజు తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది.అఘాత్యానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం బాధితురాలి బంధువులు, స్థానికులు నిందితుడి ఇంటిపై దాడి చేసి నిప్పుపెట్టిన విషయం తెలిసిందే. ఇందులో పోలీసులు పోలీసులు 9 మందిపై కేసు నమోదు చేశారు. సోమవారం కొందరిని విచారణకు తీసుకెళ్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. చిన్నారిపై లైగింక దాడి జరగడంతో ఆందోళన చేపట్టామని, బాధితులకు అండగా నిలిచిన వారిపై కేసు నమోదు చేయడం సరికాదన్నారు. నిందితులకు సహకరిస్తూ తమకు అన్యాయం చేయడం ఏంటని ప్రశ్నించారు. వాహనాన్ని కదలనీయకపోవడంతో మరోమారు గ్రామంలో ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామంలో మరోసారి ఎలాంటి ఘటన జరుగకుండా చూసుకుంటామని పోలీసులు చెప్పడంతో గొడవ సద్దు మణిగింది.

నిందితుడికి ఉరి శిక్ష విధించాలి : బీజేపీ నాయకులు

బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని హన్మకొండ ఘటన మాదిరిగా ఉరి శిక్ష విధించాలని మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు,జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతారెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు కత్తుల లక్ష్మి డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు సోమవారం బీజేపీ నాయకులు గ్రామాన్ని సందర్శించారు.


పోలీసుల వాహనాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

దసరాలోపు నామినేటెడ్

- పదవుల భర్తీకి గ్రీన్ సిగ్నల్
- సీఎంతో చర్చించిన మంత్రులు దామోదర, కొండా సురేఖ


సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : ఉమ్మడి మెదక్ జిల్లాలో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పదవులను దసరాలోపు భర్తీ చేయనున్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా మంత్రి దామోర రాజనర్సింహ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖలు సీఎం రేవంత్‌రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో ఖాళీగా ఉన్న పదవులను దసరాలోపు భర్తీ చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులను భర్తీ చేసింది. మార్కెట్ పాలకవర్గంతో పాటు, మరికొన్ని జిల్లా స్థాయి నామినేటెడ్ పదవులను కొన్నింటిని మాత్రమే భర్తీ చేసింది. గ్రంథాలయ సంస్థ చైర్మన్, కేన్ డెవలప్‌మెంట్ కమిటీ (సీడీసీ) చైర్మన్లు, దేవాలయాల పాలకమండళ్లు ఇతర నామినేటెడ్ పదవుల భర్తీ జరగలేదు. అధికారంలోకి రాగానే ఎంపీ ఎన్నికలు రావడం, ఇతర కారణాలతో ఈ పోస్టుల భర్తీ వాయిదా పడుతూ వస్తోంది. ఈ పోస్టుల కోసం జిల్లాలోని ఆ పార్టీ ముఖ్యనేతలు ఎదురు చూస్తున్నారు. జిల్లాలోని కొన్ని ముఖ్యమైన జిల్లా స్థాయి నామినేటెడ్ పోస్టులకు ఇప్పటికే దాదాపు ఖరారు కాగా, దీనిపై సీఎం ఆమోదముద్ర పడకపోవడంతో ఈ పోస్టులను అధికారికంగా ప్రకటించలేదు. తాజాగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖతో పాటు, జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహలు సోమవారం ఈ అంశంపై బేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. సోమవారం ఈ ఇద్దరు మంత్రుల పర్యటన సంగారెడ్డిలో ఉంది. కానీ అనివార్య కారణాలతో ఈ పర్యటన రద్దయింది. ఇదే రోజు ఈ ఇద్దరు మంత్రులు సీఎంతో బేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

తెలంగాణ తల్లి విగ్రహానికి నిప్పు

నిందితులను శిక్షించాలని బీఆర్ఎస్ ఫిర్యాదు


కాలినపోయిన విగ్రహం, ముసుగు

అక్కన్నపేట(హుస్నాబాద్): తెలంగాణ తల్లి విగ్రహానికి గుర్తు తెలియని దుండగులు నిప్పంటించారు. ఈ ఘటన అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని నెలల కిందట గ్రామంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేశారు. కానీ ప్రారంభం కాకపోవడంతో విగ్రహానికి ముసుగేసి ఉంచారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో ముసుగు పూర్తిగా కాలి బూడిద కాగా, విగ్రహం సల్పంగా కాలినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. సోమవారం ఉదయం గ్రామస్తులు విగ్రహం ఎదుట ఆందోళన చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మాజీ జెడ్పీటీసీ భీలు నాయక్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు గంగాధరి సుగుణ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, గ్రామ శాఖ నాయకులు వెల్ది శోభ రంగరావు, గంగాధరి రాజయ్య, గ్రామస్తులు ఎస్సై విజయ్ భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు.

మంజీరాలో నీటమునిగి రైతు మృతి

హవేళిఘణాపూర్(మెదక్): మంజీరా పరివాహక ప్రాంతంలో నీట మునిగి రైతు మృతి చెందాడు. ఈ ఘటన మెదక్ మండల పరిధిలోని మగ్దూంపూర్ గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన గణేశ్, చిన్ననొల్ల బాల్‌రాజ్(42) ఆదివారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లారు. గణేశ్ పొలంకు సరఫరా చేసే నీటిలోని మోటార్ పని చేయకపోవడంతో అతడు చెప్పగానే బాల్‌రాజ్ నీటిలోకి దిగాడు. సింగూరు నుంచి వస్తున్న వరద ఉధృతంగా వస్తుండడంతో నీటమునిగి గల్లంతయ్యాడు. ఈ విషయాన్ని గణేశ్ గ్రామస్తులకు తెలుపగా వారు వచ్చి గాలించినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం ఈతగాళ్లతో వెతకగా సాయంత్రం మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య నర్సమ్మ ఉండగా, ఆమె ఫిర్యాదు మేరకు మెదక్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..

కౌల్చారం(నర్సాపూర్): విద్యుదాఘాతానికి వ్యక్తి మతి చెందిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. కౌల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన నీరుడి రాములు(55) ఇంటి పక్కనే ఉన్న పశువుల పాకలో విద్యుత్ బల్బు అమర్చుతుండగా కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య మైసమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మేస్త్రీ ..

వెల్దుర్తి(తూప్రాన్) : రోడ్డు ప్రమాదంలో మేస్త్రీ మృతి చెందిన ఘటన మండలంలోని అందుగులపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఏఎస్సై సదాత్ మియా కథనం మేరకు.. ఏపీలోని కర్నూల్ జిల్లాకు చెందిన కట్ల రమేశ్(35)కొద్దిరోజులుగా మండలంలోని మానెపల్లిలో ఉంటూ మేస్త్రీగా పని చేస్తున్నాడు. అందుగులపల్లిలో ఉన్న సైటు వద్దకు వెళ్లి తిరిగి బైక్‌పై మానెపల్లికి వెళ్తుండగా అందుగులపల్లి గ్రామ శివారులోకి రాగానే చెట్టును ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

గోడ కూలీ వ్యక్తి

తూప్రాన్: ప్రమాదవశాత్తు ఇంటి గోడ కూలీ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మాల్కాపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం మేరకు.. గ్రామానికి చెందిన కొంతం నర్సింలు(55) ఇంట్లో పైపులైను బిగిస్తున్న క్రమంలో గోడ కూలీ మీద పడింది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు

గజ్వేల్‌రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అక్కారం వద్దగల మిషన్ భగీరథ పంప్‌హౌజ్ వద్ద సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గజ్వేల్ మండలం మక్తమాసాన్‌పల్లికి చెందిన చింత వెంకటేశ్(26)కి ఇదే గ్రామానికి చెందిన శిరీషతో మూడేళ్ల కిందట వివాహం జరిగింది. వెంకటేశ్ తొమ్మిదేళ్లుగా పంప్‌హౌజ్ వద్ద ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం విధులకు వెళ్లి పంప్‌హౌజ్‌లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకున్నారు.